క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

పెదకాకాని: గుంటూరు ఆటోనగర్ ఉపకేంద్రం లో విద్యుత్ లైన్ల మరమ్మతుల దృష్ట్యా శని వారం సరఫరా నిలిపివేయనున్నట్లు డెప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌లు పిహెచ్.ఖాన్, ఎం.ర వికుమార్ తెలిపారు. ఉదయం 8 గంటల నుం చి మధ్యాహ్నం 12 గంటల వరకూ ఆటోనగర్ లారీ స్టాండ్ ఏరియా, బైపాస్ రోడ్డు, ఎస్‌వీఆర్ కంపెనీ ఏరియా, కాకుమానువారి తోట ప్రాం తాల్లో సరఫరా ఉండదని చెప్పారు. వినియో గదారులు సహకరించాలని కోరారు.

నిత్యాన్నదాన పథకానికి రూ.50 వేల విరాళం



పెదకాకాని: శివాలయం అభివృద్ధికి దాతల సహకారం అభినందనీయమని ఆలయ డెప్యూటీ కమిషనర్ కేబీ శ్రీనివాస్ అన్నారు. పెదకాకాని శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవస్థానంలో శుక్రవారం పల్నాడు జిల్లా చిలక లూరిపేటకు చెందిన షోడా రత్నాచారి, లక్ష్మీక నకదుర్గ దంపతులు ఆలయ అభివృద్ధికి, నిత్య అన్నదాన పథకం నిమిత్తం రూ.50 వేలు అం దజేశారు. దాతలకు ప్రత్యేక దర్శనం చేయిం చి, స్వామివారి శేష వస్త్రంతో సత్కరించారు.

చిరుధాన్యాలతోనే ఆరోగ్యం

గుంటూరు రూరల్: ప్రస్తుత మన ప్రధాన ఆహా రలైనటువంటి బియ్యం, గోధుములు ఆరోగ్యా నికి అంత మంచివి కావని, గతంలో మన పూర్వీకులు అందరూ చిరుధాన్యాలనే ప్రధాన ఆహారంగా తీసుకునే వారని ప్రముఖ ఆరోగ్య ఆహార నిపుణురాలు డాక్టర్ సరళఖాదర్ తెలి పారు. శుక్రవారం వట్టిచెరుకూరు మండలం పుల్లడిగుంట నందున్న రైతునేస్తం ఫౌండేషన్‌లో ఏర్పాటు చేసిన చిరుధాన్యాలతో జీవన సిరి ఆరోగ్యం శిక్షణ కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ సిరి ధాన్యాలైన కొర్రలు, అండుకొర్రలు, సామలు, ఊదలు, ఆరికలు లాంటి వాటివి ప్రధాన ఆహారాలుగా తీసుకుంటే ఆరోగ్యంగా ఉంటార న్నారు. రైతునేస్తం ఫౌండేషన్ చైర్మన్ యడ్ల పల్లి వేంకటేశ్వరరావు మాట్లాడారు.

ముమ్మరంగా బీజేపీ సభ్యత నమోదు

చేబ్రోలు: గుంటూరు జిల్లాలో బీజేపీ క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమం ముమ్మరంగా జరుగుతుందని బీజేపీ క్రియాశీలక సభ్యత్వ ప్రముఖ్ కొత్తూరు వెంకట సుబ్బారావు అన్నారు. మండల కేంద్రమైన చేబ్రోలులో శుక్ర వారం బీజేపీ క్రియాశీలక సభ్యత నమోదు కార్య క్రమంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానమం త్రి నరేంద్రమోదీ ఆధ్వర్యంలో దేశంలో అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం ఉపాధి, సంక్షేమ కార్యక్రమాలను చేపడతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో చేబ్రోలు మండల ప్రముఖ్ మాడా సీతరామయ్య మాట్లాడారు.

విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలు

కొరిటెపాడు: ప్రతి ఒక్కరూ బాధ్యతతో విధులు నిర్వర్తించాలని విద్యుత్ శాఖ ఎస్ఈ కేవీఎల్ మూర్తి పేర్కొన్నారు. గుంటూరు జిల్లా విద్యుత్ శాఖ సర్కిల్ పరిధిలో గుంటూరు సూపరింటెం డెంట్ ఇంజినీరు ఆధ్వర్యంలో నల్లచెరువులోని సమావేశ మందిరంలో వర్క్స్ రివ్యూ సమావేశం శుక్రవారం నిర్వహించారు. మూర్తి మాట్లా డుతూ ప్రతి ఒక్కరూ బాధ్యతతో ఉద్యోగ విధులు నిర్వర్తించాలన్నారు. వినియోగదారు లకు అంతరాయం లేని విద్యుత్ సరఫరా చేయాలని కోరారు. విద్యుత్ సరఫరాలో ఎలాం టి లోపాలు లేకుండా విద్యుత్ శాఖ పరికరాలు, మీటర్స్ ఎప్పటికప్పుడు మార్చి కొత్తవి నిర్మా ణాలు చేపట్టాలని ఆదేశించారు. ఎవరైనా విని యోగదారుడు సర్వీసు కొరకు దరఖాస్తు చేస్తే వెంటనే నియమ నిబంధనలను అనుసరించి వారికి విద్యుత్ సర్వీసు ఏర్పాటు చేయాలని సూచించారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ పరికరాలు తగిన సమయంలో అందుబాటులో ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాలు కలగకుండా ప్రజ లకు అందుబాటులో ఉండి పని చేయాలని ఆదే శించారు. సమావేశంలో సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ పాశం రామిరెడ్డి, ఎగ్జిక్యూటివ్ ఇం జినీర్లు చిరంజీవి, శ్రీనివాస్ బాబు పాల్గొన్నారు.

గిరిప్రదక్షిణకు ప్రత్యేక ఆర్టీసీ సర్వీసులు

పట్నంబజారు: కార్తిక మాసం పౌర్ణమి పురస్కరిం చుకుని ఈనెల 15న అరుణాచలంలో నిర్వహించ నున్న గిరి ప్రదక్షిణకు ప్రత్యేక సర్వీసులు ఏర్పాటు చేయనున్నట్లు ఏపీఎస్ ఆర్టీసీ ఆర్ఎం ఎం.రవి కాంత్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గిరి ప్రదక్షిణకు సంబంధించి ఈనెల 13 రాత్రి 9.15 గంటలకు గుంటూరు ఆర్టీసీ బస్టాండ్ నుంచి బస్సు బయల్దేరుతోందని, 14న కాణిపాకం, శ్రీకాళహస్తి, గోల్డెన్ టెంపులు దర్శించుకుని, అదే రోజు రాత్రి అరుణాచలం చేరుకుంటుందన్నారు. 15వ తేదీ ఉదయం గిరిప్రదక్షిణ చేసుకుని, అరు ణాచలం దర్శనం అనంతరం సాయంత్రం బయల్దేరి 16వ తేదీ ఉదయం గుంటూరు చేరుకుంటుందని తెలిపారు. ఆన్‌లైన్ ద్వారా రిజర్వేషన్ చేయాలనుకునేవారు 96164 సర్వీసు నంబరులో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచిం చారు. టికెట్ ధర రూ. 2,420 తెలిపారు. మరిన్ని వివరాలకు 7382897459, 7382896403 నంబర్లను సంప్రదించాలని కోరారు.

మొక్కుబడిగా పొలం పిలుస్తోంది

- తూతూమాత్రంగా అవగాహన సదస్సులు
- హాజరవని అనుబంధ శాఖల అధికారులు
- దీంతో రైతుల నుంచి స్పందన కరువు



వ్యవసాయ శాఖ అధికారుల మాత్రమే పాల్గొన్న పొలం పిలుస్తోంది(ఫైల్)

పొన్నూరు: 'పొలం పిలుస్తోంది' మొక్కుబడిగా సాగుతోంది. పంటల సాగులో రైతులకు ఉన్న సం దేహాలను నివృత్తి చేసి నాణ్యమైన మంచి దిగుబ డులు సాధించేందుకు అధికారులు సలహాలు, సూచనలు అందజేయడమే కార్యక్రమం ఉద్దేశం. కార్యక్రమానికి వ్యవసాయ శాఖతో పాటు, ఉద్యాన శాఖ, పశుసంవర్ధక శాఖ, మత్స్యశాఖ, మార్కెటింగ్ శాఖ, ఇరిగేషన్, విద్యుత్, తదితర సుమారు పది శాఖల అధికారులు విధిగా హాజరుకావాలి. కానీ వాస్తవంగా రెండు, మూడు శాఖల కంటే ఎక్కువగా రావడం లేదు. అనుబంధ శాఖల అధికారులు వివిధ కారణాలు చెబుతూ డుమ్మా కొడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. క్షేత్రస్థాయిలో అనుకున్న రీతిలో కార్యక్రమం జరగడం లేదు. వ్యవసా యశాఖ సిబ్బంది మాత్రమే రైతు సేవా కేంద్రాల్లో నామమాత్రంగా అవగాహన సదస్సులు నిర్వహిం చి చేతులు దులుపుకొంటున్నారు. వీటిని వాట్సాప్ ద్వారా ప్రచారం చేసుకుంటున్నారు. ప్రభుత్వం వేలల్లో ఖర్చు చేస్తున్నా ఫలితం కనిపించడం లేదు. దీంతో రైతులు పొలం పిలుస్తోంది కార్యక్రమంపై పెదవి విరుస్తున్నారు.

నీరుగారుతున్న లక్ష్యం

మండలంలోని 29 గ్రామాల్లో సుమారు 30 వేల ఎకరాల్లో వరి, కూరగాయలు, మినుము, మొక్కజొన్న, తమలపాకులు తదితర పంటలు సాగులో ఉన్నాయి. ప్రభుత్వం సెప్టెంబరు 24 నుండి డిసెం బరు 31 వరకు పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించనుంది. కార్యక్రమంలో రైతులకు సాగు వ్యయం తగ్గింపు, మెరుగైన సాగు పద్ధతులు, పంట రుణాలు అందించడంపై వ్యవసాయ, హార్టికల్చర్, మార్కెటింగ్, బ్యాంకు అధికారులు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలి. తద్వారా వారి ఆదా యాన్ని పెంచేందుకు కృషి చేయాలి. క్షేత్రస్థాయిలో పర్యటించి పంటలను పరిశీలించి సూచనలు చేయాలి. అయితే పంటలను వివిధ రకాల చీడ పీడలు పీడిస్తున్నాయి. ఇటీవల అధిక వర్షాలతో పైర్లు దెబ్బతిన్నాయి. రబీ సీజన్ కూడా మొదలైంది. ఈ పరిస్థితుల్లో రైతులకు వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులు అండగా నిలవాలి. బ్యాంకులు పంట రుణాలపై అవగాహన కల్పించాలి. ఇలా వ్యవసాయ సంబంధిత శాఖలన్నీ రైతులకు అవసరమైన సూచనలు, సలహాలు ఇచ్చి భరోసా కల్పించాలి. కానీ ఆశించిన మేర రైతులకు అండగా నిలవడం లేదనే ఆరోపణలున్నాయి.

అధికారులందరూ హాజరుకావాలి



పొలం పిలుస్తోంది కార్యక్రమానికి వ్యవసాయ శాఖతో పాటు అనుబంధ శాఖల అధికారులు హాజరుకావాలి. ప్రతిరోజూ ఉన్నతాధికారులకు నివేదికలు పంపాలి. కానీ కొన్ని శాఖల అధికారులు హాజరు కావడం లేదు. అందరూ బాధ్యతగా హాజరు అయితే రైతులకు ప్రయోజనకరంగా ఉంటోంది.
–దేగల వెంకట్రామయ్య, ఏఓ, పొన్నూరు

రేషన్ పంపిణీలో ఫిర్యాదులొస్తే చర్యలు



తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసిన కార్డుదారుడు

పొన్నూరు: ప్రతి నెలా కార్డుదారులకు ఎండీయూ వాహనాల ద్వారా అందించే రేషన్, ఇతర సరుకులు సక్రమంగా అందించాలని, ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తే తగిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ మహమ్మద్ జియావుల్ హక్ అన్నారు. పట్టణంలోని ఒకటో వార్డుకు చెందిన తెల్ల రేషన్ కార్డుదారుడు నాగుర్‌బాషా మూడు నెలల నుంచి రేషన్, సరుకులు ఇవ్వడం లేదని తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని కార్యాలయ సిబ్బందిని తహసీల్దార్ ఆదేశించారు. రేషన్ పంపిణీపై వార్డు ప్రజలను విచారించాలని సూచించారు. రేషన్ పంపిణీ విషయంలో ప్రాధాన్యాన్ని అధికారులు గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలి



పెదకాకాని తహసీల్దార్ కృష్ణకాంత్‌కు వినతి పత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

పెదకాకాని: ప్రభుత్వ భూముల్లో నివాసాలు ఏర్పాటు చేసుకుని జీవిస్తున్న వారందరికీ ఇళ్ల పట్టాలు ఇవ్వాలని సీపీఎం జిల్లా నాయకుడు వై.నేతాజి అన్నారు. పెదకాకానిలో శుక్రవారం సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం వద్ద పేదలకు ఇళ్ళ పట్టాలు ఇవ్వాలని, నిత్యావసర సరుకుల ధరలు తగ్గించాలని కోరుతూ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నేతాజీ మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ మూడోసారి అధికారంలోకి వచ్చాక నిత్యావసరాలు, పెట్రోల్, డీజిల్, గ్యాస్, కరెంటు చార్జీలు అదుపు లేకుండా పెరిగాయన్నారు. జీఎస్టీ పేరుతో ప్రజలపై మోయలేని భారాలు మోపారని విమర్శించారు. జెమిలి ఎన్నికలు ఒక ఎన్నిక ఒకే దేశం అనే పేరుతో కార్పొరేట్ సంస్థలకు మేలు చేసేలా కార్మికులకు నష్టం కలిగించేలా కార్మిక చట్టాల్లో మార్పు చేశారన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలు ప్రైవేట్ చేయటం, ఎల్ఐసీ, పోస్టల్, రైల్వే లాంటి ప్రభుత్వ రంగ సంస్థలు, ప్రైవేటు చేయడం వలన నిరుద్యోగం విపరీతంగా పెరిగిందన్నారు. సీపీఎం మండల కమిటీ కన్వీనర్ నన్నపనేని శివాజీ మాట్లాడుతూ ప్రభుత్వ భూముల్లో ఇండ్లు నిర్మించుకొని నివాసం ఉంటున్న సుందరయ్య కాలనీ, స్వర్ణపురి కాలనీ, ఎన్టీఆర్ కాలనీ, వడ్డెర కాలనీ, శ్రీ శివదుర్గ కాలనీల్లో నివాసం ఉంటున్న పేదలకు పట్టాలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కె.బాబూరావు, బి.సాంబయ్య, కె.సత్యనారాయణ, వి.శివయ్య, కె.రాఘవయ్య, జెట్టి రాజలక్ష్మి, పి.నాగమణి, ఎ.నాగేశ్వరావు, ఆర్.వెంకటరమణ, కె.సాంబశివరావు, షేక్ హసీనా పాల్గొన్నారు. అనంతరం తహసీల్దార్ కృష్ణకాంత్‌కు వినతి పత్రం అందజేశారు.

ఆన్‌లైన్ సైబర్ మోసాలపై అవగాహన అవసరం

పొన్నూరు రూరల్ సీఐ కోటేశ్వరరావు



వేజండ్ల(చేబ్రోలు): ఆన్‌లైన్ సైబర్ మోసాలపై ప్రజలు చైతన్యవంతులై తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పొన్నూరు రూరల్ సీఐ వై.కోటేశ్వరరావు అన్నారు. గ్రామంలో శుక్రవారం రాత్రి వారధి కార్యక్రమం నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ వివిధ చట్టాలు, శిక్షలు గురించి అవగాహన కల్పించారు. క్షణికావేశంలో చేసే తప్పులు, పొరపాట్లు జీవితం నాశనమవుతుందని చెప్పారు. యువత సన్మార్గంలో పయనించాలని ఆకాంక్షించారు. మహిళలు, చిన్న పిల్లలపై లైంగిక దాడులు, రోడ్డు ప్రమాదంలో హెల్మెట్ యొక్క ప్రాధాన్యం తదితర అంశాల గురించి గ్రామస్తులకు వీడియో ద్వారా అవగాహన కల్పించారు. చేబ్రోలు ఎస్ఐ డి.వెంకటకృష్ణ పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో పెట్ సీటీస్కాన్ కొనుగోలుకు అనుమతి

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్‌లో నాట్కో క్యాన్సర్ సెంటర్‌లో పెట్ సీటీస్కాన్ మిషన్ కొనుగోలుకు అనుమతి మంజూరు చేస్తూ రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. న్యూఢిల్లీకి చెందిన బ్రాండ్ లేబొరేటరీస్ లిమిటెడ్ కంపెనీ వారికి పెట్ సీటీ టెండర్లు దక్కించుకోవడంతో వారికి మిషన్ కొనుగోలు ఆర్డర్ జారీ చేశారు. క్యాన్సర్ రోగులకు త్వరితగతిన క్యాన్సర్ వ్యాధి నిర్ధారణ కోసం పెట్ సీటీస్కాన్ మిషన్ ఎంతో అవసరం. ఈ వైద్య పరికరం జీజీహెచ్‌లో లేకపోవడంతో ఆరోగ్యశ్రీ పథకం ద్వారా బయట స్కానింగ్ సెంటర్లలో చేయిస్తున్నారు. పెట్ సీటీస్కాన్ పరీక్ష చేసేందుకు రూ.25 వేల వరకు ప్రైవేటు స్కానింగ్ సెంటర్ల వారు ఫీజు తీసుకుంటున్నారు.

జీజీహెచ్ నాట్కో క్యాన్సర్ సెంటర్‌లో పెట్ సీటీస్కాన్ అందుబాటులోకి రావడం వల్ల పేద రోగులకు మెరుగైన వైద్యం సత్వర వైద్య సేవలు లభించే అవకాశం ఉంది. వైద్య పరికరం కొనుగోలుకు రూ.18 కోట్లు ప్రభుత్వం ఎన్టీఆర్ వైద్య సేవ పథకం ద్వారా విడుదల చేసింది. మూడు నెలల్లోపు వైద్య పరికరాన్ని జీజీహెచ్‌లో అందుబాటులోకి తీసుకు రావాలంటూ పర్చేజ్ ఆర్డర్‌లో ఉత్తర్వులు జారీ చేశారు. గుంటూరు జీజీహెచ్ నాట్కో క్యాన్సర్ సెంటర్, నాట్కో ట్రస్టు ఆధ్వర్యంలో కార్పొరేట్ వైద్య సేవలను పేద ప్రజలకు ఉచితంగా అందజేస్తుంది. సుమారు రూ.45 కోట్లతో నాట్కో క్యాన్సర్ సెంటర్‌ను నాట్కో ట్రస్టు చైర్మన్ నన్నపనేని వీసీ నిర్మించారు. ఈనెలాఖరులోపు మరో వంద పడకలతో రూ.20 కోట్లతో క్యాన్సర్ చివరి దశలో ఉన్న రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు మరో క్యాన్సర్ భవనం నిర్మాణం చేపడుతున్నట్లు నాట్కో ట్రస్టు వైస్ చైర్మన్ నన్నపనేని సదాశివరావు తెలిపారు.

రైతులకు మినుము విత్తనాలు పంపిణీ



ఉప్పలపాడులో పంపిణీ చేస్తున్న వ్యవసాయ శాఖ జిల్లా అధికారి నున్న వెంకటేశ్వర్లు



రైతుకు మినుము సంచిని అందిస్తున్న అధికారులు

పెదకాకాని: జాతీయ ఆహార భద్రతామిషన్ పథకం కింద రైతులకు మినుము విత్తనాలు పంపిణీ చేస్తున్నట్లు జిల్లా వ్యవసాయ అధికారి నున్నా వెంకటేశ్వర్లు అన్నారు. మండలంలోని తక్కెళ్లపాడు, ఉప్పలపాడు గ్రామాలలో మినుము వీబీఎన్ 8 రకం విత్తనాలు ఒక్కొక్క రైతుకు 4 కిలోల నూరుశాతం రాయితీపై శుక్రవారం అందించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ వీబీఎన్ 8 రకం ప్రత్యేక రకమని తెగుళ్ల, పురుగుల బారి నుంచి తట్టుకునే శక్తి ఉంటుందన్నారు. అధిక దిగుబడులు వస్తాయని వివరించారు. కార్యక్రమంలో డెప్యూటీ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ ఎస్‌సీహెచ్ బాలునాయక్, మండల వ్యవసాయ అధికారి పి.సంధ్యారాణి, టెక్నికల్ అసిస్టెంట్లు బి.శ్రీనివాస్, ఎస్.శ్రీవాణి, ఏఈఓలు ఆర్‌వీ శివాజీ, ఎస్‌వీ శివరావు, ఉప్పలపాడు ఉప సర్పంచి దుద్దుకూరి భూసిబాబు, వీఏఏలు డి.ప్రియాంక, పీవీ జ్యోత్స్న పాల్గొన్నారు.

రైతులకు మినుము సంచుల పంపిణీ

పొన్నూరు: వీబీఎన్ 8 మినుము రకాన్ని రైతులు వినియోగించి పంట దిగుబడిని గమనిస్తే భవిష్యత్‌లో ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని పోషణ, ఆహార భద్రత పథకం సాంకేతిక సహాయకులు శ్రీనివాస్ తెలిపారు. మండలంలోని వెల్లలూరు రైతు సేవ కేంద్రంలో పోషణ, ఆహార భద్రత పథకంలో భాగంగా శుక్రవారం వీబీఎన్ 8 అనే మినుము రకాన్ని పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏడీఏ రామకోటేశ్వరి, ఏఓ దేగల వెంకట్రామయ్య పాల్గొన్నారు.

విద్యుత్ చౌర్యానికి పాల్పడితే కఠిన చర్యలు



మాట్లాడుతున్న ఎస్ఈ ఆంజనేయులు

కాకుమాను: నిబంధనలకు విరుద్ధంగా విద్యుత్ వినియోగదారులు వినియోగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని బాపట్ల జిల్లా విద్యుత్ శాఖ అధికారి(ఎస్ఈ) జి.ఆంజనేయులు హెచ్చరించారు. మండలంలోని గ్రామాలలో శుక్రవారం సిబ్బందితో తనిఖీలు నిర్వహించారు. ఎస్ఈ మాట్లాడుతూ మండలంలోని 2,857 విద్యుత్ సర్వీస్‌లను పరిశీలించగా వాటిలో 87 మంది అదనంగా విద్యుత్ ఉపయోగిస్తున్నట్లు గుర్తించినట్లు తెలిపారు. వారికి రూ.4.03 లక్షలు అపరాధ రుసుం వేసినట్లు చెప్పారు. గృహ అవసరాల కోసం విద్యుత్ మీటర్లు తీసుకుని వ్యాపార లావాదేవీలకు ఉపయోగిస్తున్న ఇద్దరిని గుర్తించి వారికి తొమ్మిది వేలు అపరాధ రుసుం వసూలు చేసినట్లు చెప్పారు. మండలంలో మొత్తం 90 కేసులు నమోదు చేసి రూ.7 లక్షల 13 వేలు అపరాధ రుసుం చెల్లించాలని వినియోగదారులకు నోటీసులు జారీ చేసినట్లు ఎస్ఈ ఆంజనేయులు వెల్లడించారు. దాడుల్లో పొన్నూరు డీఈ డి.శ్యాం కుమార్, బాపట్ల జిల్లా డీఈఈ డీపీ మల్లికార్జునరావు, ఏఈ పఠాన్ మౌలాలి ఖాన్ పాల్గొన్నారు.

ఉక్కు నిర్మాణాలపై పరిశోధనలు అవసరం

ఆర్‌వీఆర్‌జేసీలో నిర్వహించిన సెమినార్‌లో వక్తలు



అతిథులను సన్మానిస్తున్న కళాశాల ప్రతినిధులు

గుంటూరు రూరల్: నిర్మాణ రంగంలో బలమైన దేశ భవిష్యత్‌ను నిర్మించడానికి ఉక్కు నిర్మాణాలపై పరిశోధనలు అవసరమని హైదరాబాద్ ఐఐటీ ప్రొఫెసర్ మహేంద్రకుమార్ మాధవన్ పేర్కొన్నారు. శుక్రవారం చౌడవరంలోని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాలలో నీడ్ ఫర్ రీసెర్చ్ ఆన్ స్టీల్ స్ట్రక్చర్స్ అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నిర్మాణ రంగంలో వివిధ దేశాల్లో టెక్నాలజీ ఆధారంగా అవలంబిస్తున్న నిర్మాణ పద్ధతులను వివరించారు. వరదలు, భూకంపాలు వంటి విపత్తులు సంభవించినప్పుడు వాటి నుంచి రోడ్లు, భవనాలు, వంతెనలు వంటి వివిధ నిర్మాణాలను రక్షించుకునేందుకు చేపట్టాల్సిన చర్యలను వివరించారు. నిత్యం పెరుగుతున్న జనాభాలో అధిక శాతం మంది ప్రజలు పట్టణ ప్రాంతాల్లోనే జీవనం సాగిస్తున్నారని అక్కడ ఉన్న భూ విస్తీర్ణతలో ప్రజల నివాస సౌకర్యాలకు అనుగుణంగా ఎత్తైన భవన నిర్మాణాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఆ ప్రాంత వాతావరణ అనుకూలత ప్రతికూలతలను తట్టుకునే విధంగా తక్కువ సమయంలో టెక్నాలజీ ఆధారంగా సుస్థిరమైన నిర్మాణాలను చేపట్టడంలో సివిల్ ఇంజినీర్లు కీలక పాత్ర పోషించాలన్నారు. పర్యావరణ పరిరక్షణ దిశగా నిర్మాణ రంగంలో విద్యార్థులు నూతన ఆలోచనలు చేయాలని తెలిపారు. అద్భుత నిర్మాణాల సృష్టి సివిల్ ఇంజినీర్ల మేధా శక్తే అని కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్.శ్రీనివాస్, ఉపాధ్యక్షులు జాగర్లమూడి మురళీమోహన్, డాక్టర్ జగదీష్ మద్దినేని పేర్కొన్నారు. సివిల్ ఇంజినీర్ విద్యార్థులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాఖలతో పాటు, విదేశాల్లో మంచి అవకాశాలు ఉన్నాయని కళాశాల సెక్రటరీ కరెస్పాండెంట్ ఆర్.గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్ పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాస్, డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర, ఏఓ డైరెక్టర్ డాక్టర్ ఎన్వీ శ్రీనివాసరావు, డాక్టర్ ఏఎస్ ప్రసాద్, డాక్టర్ ఎమ్ఎల్ఎన్ కృష్ణసాయి, పీవీఎస్ మారుతీకృష్ణ పాల్గొన్నారు.

ముగిసిన పీఏసీఎస్‌ల శిక్షణ తరగతులు



సమగ్ర యాజమాన్య పద్ధతులపై పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న శాస్త్రవేత్తలు

గుంటూరు రూరల్: రైతులకు వ్యవసాయ యాజమాన్యంలో పీఏసీఎస్ ప్రతినిధులు నేర్చుకున్న ప్రతి విషయాన్ని తెలియజేసి రైతుల అభివృద్ధికి కృషి చేయాలని లాంఫాం వ్యవసాయ పరిశోధన స్థానం అసోసియేట్ రీసెర్చ్ డైరెక్టర్ డాక్టర్ ఎన్‌వీవీఎస్ దుర్గాప్రసాద్ తెలిపారు. గత 15 రోజులుగా నగర శివారుల్లోని లాంఫాంలో ప్రాథమిక సమకార సంఘం ప్రతినిధుల(పీఏసీఎస్)కు సమగ్ర పోషక యాజమాన్యంపై నిర్వహిస్తున్న శిక్షణ తరగతులు శుక్రవారంతో ముగిశాయి. ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో రైతుల ఉన్నతికి ప్రతి ఒక్కరం సమష్టిగా కృషి చేయాల్సిన ఆవశ్యకత ఉందని చెప్పారు. జిల్లా కో ఆపరేటివ్ ఆఫీసర్ ఎం.వీరాచారి మాట్లాడుతూ అందరివాడైన రైతు నేడు ఒంటరివాడై పోరాడుతున్నాడని, అటువంటి రైతుకు ప్రతి ఒక్కరూ తమ వంతు సాయం అందించాలని కోరారు. సాంకేతిక సలహాలు, ప్రత్యామ్నాయ పంటలు, సరైన విధంగా వివరించాలన్నారు. పంట మార్పిడి ఎంతో అవసరమని పేర్కొన్నారు. మంగళగిరి ఏడీఏ ఎస్ఎం పుణ్యవతి మాట్లాడుతూ సేంద్రియ వ్యవసాయం ప్రతి రైతుకు తెలియజేయాలని చెప్పారు. ఆరోగ్యకరమైన పంటలను ప్రజలకు అందించేందుకు కృషి చేయాలన్నారు. అనంతరం సమగ్ర యాజమాన్య పద్ధతుల పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ సంచాలక విభాగం ప్రతినిధి డాక్టర్ పీ ముకుందరావు, ఏరువాక కేంద్రం సమన్వయకర్త డాక్టర్ ఎస్.వెంకటలక్ష్మి, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ ఎం.వెంకటరాములు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ విలువలతో జీవించాలి



అతిథులను సన్మానిస్తున్న కళాశాల ప్రతినిధులు

గుంటూరు రూరల్: ప్రతి ఒక్కరూ విలువలతో జీవించాలని సెయింట్ ఆన్స్ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ రెవరెండ్ సిస్టర్ సంధ్య తెలిపారు. శుక్రవారం నగర శివారుల్లోని గోరంట్లలోని కళాశాలలో విద్యార్థులకు పరధ్యాన నియంత్రణ, విలువలతో కూడి జీవితం అనే అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ నైతిక విలువలు పాటిస్తూ సమాజంపై అవగాహనతో ఉన్నత స్థితికి చేరుకోవాలన్నారు. ఏఎన్‌యూ సైకాలజీ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ టీడీ విమల మాట్లాడుతూ పరధ్యానాన్ని నియంత్రిస్తూ ఉన్నతమైన విలువలను కాపాడుకుంటూ ప్రతి ఒక్కరికి ఆదర్శప్రాయంగా జీవించేందుకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఆర్.షారోన్‌రోజ్, బి.జూయిస్, జి.రాధిక, పి.నరసింహారావు, జి.సరోజ, అతిథులను సన్మానించారు.

చలపతిలో రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న విద్యార్థులు, అధ్యాపకులు

గుంటూరు రూరల్: ఒకరి రక్తదానంతో ఇద్దరి ప్రాణాలు కాపాడవచ్చని చలపతి ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.చంద్రశేఖర్ తెలిపారు. శుక్రవారం నగర శివారుల్లోని లాంలోని కళాశాలలో ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఆరోగ్యంగా ఉన్న ప్రతి ఒక్కరూ ప్రతి మూడు నెలలకు ఒకసారి రక్తదానం చేయవచ్చన్నారు. దేన్నయినా సృష్టించవచ్చని కానీ రక్తాన్ని సృష్టించలేమని ప్రతి ఒక్కరూ గమనించాలని చెప్పారు. కార్యక్రమంలో భాగంగా శ్రీ వెల్ఫేర్ సొసైటీ, హెచ్‌డీ ఎఫ్‌సీ సౌజన్యంతో నిర్వహించిన రక్తదాన కార్యక్రమంలో విద్యార్థులు అధ్యాపకులు 150 మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు డాక్టర్ డి.తిరుపతినాయుడు, డాక్టర్ ఆర్.శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఉద్యోగ, ఉపాధ్యాయులకు 35 శాతం ఐఆర్ ప్రకటించాలి

ఏఐఎస్టీఎఫ్ ఆర్థిక కార్యదర్శి సుధీర్‌బాబు



గుంటూరు ఎడ్యుకేషన్: వేతన సవరణ సంఘ ఏర్పాటులో తీవ్ర జాప్యం నెలకొన్న దృష్ట్యా, ఉద్యోగ, ఉపాధ్యాయులకు 35 శాతం మధ్యంతర భృతిని తక్షణమే ప్రకటించాలని అఖిల భారత సెకండరీ టీచర్స్ అసోసియేషన్(ఏఐఎస్టీఎఫ్) ఆర్థిక కార్యదర్శి సీహెచ్ జోసఫ్ సుధీర్‌బాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కంకరగుంటలోని ఎస్టీయూ భవన్‌లో శుక్రవారం సంఘ ప్రాంతీయ కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పీఆర్సీ కమిటీని వెంటనే ఏర్పాటు చేసి, కమిటీ నివేదిక వచ్చేవరకు 35 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలన్నారు. కేంద్ర ప్రభుత్వంతో పాటు వివిధ రాష్ట్రాలు సైతం ఉద్యోగులకు డీఏలు ప్రకటించినప్పటికీ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం డీఏల ఊసు ఎత్తడం లేదని విమర్శించారు. పెరుగుతున్న జీవన ప్రమాణాలు, నిత్యావసర ధరల పెరుగుదల దృష్ట్యా తక్షణమే కరవు భత్యాన్ని ప్రకటించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని ఉద్యోగ, ఉపాధ్యాయులకు రూ.26 వేల కోట్ల మేరకు పేరుకుపోయిన డీఏ, పీఆర్సీ, పెండింగ్ బకాయిలను క్లియర్ చేయాలన్నారు. జిల్లా అధ్యక్షుడు డి.పెదబాబు మాట్లాడుతూ యాప్‌ల భారం లేకుండా చేస్తామని చెప్పిన ప్రభుత్వం తగ్గించకపోగా అపార్ ఐడీలు అంటూ ఇతరత్రా పనులతో ఉపాధ్యాయులను బోధనకు దూరం చేసి మానసిక ఒత్తిడి కలుగజేస్తోందని ఆరోపించారు. యాప్‌ల భారాన్ని తొలగించడంతో పాటు అపార్ ఐడీల జనరేషన్‌లో ఎదురయ్యే సాంకేతిక సమస్యలను పరిష్కరించి, ప్రతి గ్రామంలో ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని కోరారు. జిల్లా ప్రధాన కార్యదర్శి డీకే సుబ్బారెడ్డి మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సీపీఎస్‌ను తక్షణమే రద్దు చేసి, రాష్ట్రంలోని ఉద్యోగులందరికీ ఒకే పెన్షన్ విధానాన్ని కొనసాగిస్తూ, ఉద్యోగ విరమణ అనంతరం ఉద్యోగులకు ప్రభుత్వం భరోసా కల్పించాలని కోరారు. 117 జీవోను రద్దు చేస్తామని చెప్పిన ఎన్నికల హామీ మేరకు వెంటనే ఆ జీఓను రద్దు చేసి ప్రాథమిక పాఠశాలలను బలోపేతం చేయాలని కోరారు. 2022 ఏప్రిల్ నుంచి పెండింగ్‌లో ఉన్న సరెండర్ లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్, 2024 మార్చి నుంచి పెండింగ్‌లో ఉన్న పీఎఫ్, ఏపీజీఎల్ఐ లోన్లు, క్లోజర్స్‌ను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఎస్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాసిమళ్ల ప్రసాద్, రాష్ట్ర కౌన్సిలర్లు డీపీ జోసెఫ్, షేక్ బాజీ, సుబ్బారావు, గుంటూరు నగరపాలక సంస్థ, తుళ్ళూరు, తాడికొండ, మేడికొండూరు, ప్రత్తిపాడు, వట్టిచెరుకూరు పాల్గొన్నారు.